

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 01-07-2026 | సంపుటి - 29 | సంచిక -39 | రూ : 4 | పేజీలు: 8



# ఇది రైతు ప్రభుత్వం

- 30 నెలల్లో రూ.1.75 లక్షల కోట్లు వెచ్చించాం
- కంచెవేసి ఈ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత అన్నదాతలదే
- కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానీయం
- భాజపా ఆటలు తెలంగాణలో సాగవు
- వరిసాగు తగ్గించి రైతులు మెట్ట పంటలు వేయాలి
- రైతుభరోసా పంపిణీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: 'ప్రజా ప్రభుత్వం 30 నెలల పాలనలో రూ.1.75 లక్షల కోట్లు వెచ్చించి రైతులు ఆత్మగౌరవంతో బతికేలా చేసింది. వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దింది. ఈ ప్రభుత్వాన్ని కంచె వేసి కాపాడుకునే బాధ్యత మీదే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్షకులను ఉద్దేశించి అన్నారు. 'భారాస నేతలు బయలుదేరి కేసీఆర్‌ను మించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి రావాలని జనం కోరుకుంటున్నారట. ఎవరు

తరువాయి 2లో

## వికసిత భారత్ లక్ష్య సాధనలో

# యువతదే కీలక పాత్ర



- వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి పిలుపు
- కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో ప్రసంగం
- పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం
- ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన
- గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి

2లో

# హైదరాబాద్‌లో 20 వేల మంది అక్రమ వలసదారులు




- గుర్తించే పనిలో అధికారులు

హైదరాబాద్ : అక్రమ వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ హెచ్చరిక నేపథ్యంలో వివరాలు ఆరా తీస్తున్న అధికారులకు విస్తుబోయే విషయాలు బహిర్గతమవుతున్నాయి. ఒకరుకాదు.. ఇద్దరు కాదు.. అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన విదేశీయులు వేలల్లో ఉన్నారు. ఆఫ్రికా దేశాలకు చెందిన వారే 1,400 మందికి పైగా ఉన్నట్లు అధికారుల అంచనా. రోహింగ్యాల సంఖ్య సుమారు తొమ్మిదిన్నరవేలని, బంగ్లాదేశీయుల సంఖ్య అధికారికంగా 40 ఉంటే అక్రమంగా వచ్చిన వారి సంఖ్య 4 వేలకుపైనేనని లెక్కేస్తున్నారు. అక్రమంగా ప్రవేశించారంటే వారి వివరాలు ఎక్కడా రికార్డుల్లో నమోదు కావు. నిఘా వర్గాల సమాచారం ప్రకారమే ఈ జాబితా రూపొందించగా వాస్తవంలో ఇంతకంటే ఎక్కువగానే ఉండవచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. బతుకుదెరువు కోసం వచ్చిన వారి విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ అక్రమంగా దేశంలోకి ప్రవేశించడం నేరమే కాబట్టి రోహింగ్యాలు మినహా మిగతా వారిని గుర్తించి, వారివారి దేశాలకు పంపేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. చాలామంది బతుకుదెరువు కోసం వచ్చినప్పటికీ ఆఫ్రికా దేశాలకు చెందిన వారిలో పలువురు మత్తుమందుల వ్యాపారంలో మునిగితేలుతున్న విషయం తెలిసిందే. ఈగల్ అధికారులు మాదకద్రవ్యాల కేసులో 2025లో ఆఫ్రికా దేశాలకు చెందిన 24 మందిని అరెస్టు చేశారు. అంతకు ముందు అరెస్టు చేసిన వారితో కలుపుకొని మొత్తం 42 మందిని వారి దేశాలకు డిపోర్టేషన్ చేశారు. బంగ్లాదేశ్, మయన్మార్ వంటి సరిహద్దు దేశాల నుంచి అనేక మంది భద్రతా బలగాల కళ్లుగప్పి దేశంలోకి ప్రవేశిస్తున్నారు. సాధారణంగా వారు సరిహద్దు రాష్ట్రాల్లోనే

తరువాయి 2లో



# పోరాడండి.. అధికారం మనదే!

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చలేదు
- ఆర్ఆర్ ట్యాక్స్‌తో తెలంగాణ సొత్తు దిల్లీకి తరలుతోంది
- భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

2లో

# జీవితాన్ని తీర్చిదిద్దేదే నిజమైన విద్య

- విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న లోకేశ్
- అన్ని వర్గాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని వ్యాఖ్య
- విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్టపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



అమరావతి : ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, కేవలం డిగ్రీలు సంపాదించడం విద్యకు పరమార్థం కాదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి, దేశంలోని ప్రతి మూలకు చేరినప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే సంస్థలు కావు. అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, నాయకులను తయారు చేస్తాయి. ఈ రోజు జరుగుతున్నది కేవలం ఒక

తరువాయి 2లో



## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు

# కేంద్రం హై అలర్ట్!

- అమర్‌నాథ్ యాత్రపై నిఘా సంస్థల సమాచారంతో అప్రమత్తత
- యాత్ర మార్గంలో కట్టుదిట్టమైన భద్రత
- ఏఐ కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ ఏర్పాటు
- జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యలు
- యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని విజ్ఞప్తి
- జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

2లో

# భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి

## తెలంగాణలో సర్వర్లు డౌన్!




- రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!

2లో

# భారత్–జపాన్ ఆర్థిక మైత్రి: డాలర్‌కు చెక్!

- డాలర్‌ను పక్కనపెట్టి యెన్‌రూపాయి ప్రత్యక్ష లావాదేవీలకు భారత్‌జపాన్ సన్నాహాలు
- ప్రధాని మోదీతో జపాన్ ప్రధాని సనాయె తకైచి భేటీలో కీలక చర్చ
- తగ్గనున్న ఫారెక్స్, లావాదేవీల ఖర్చులు.. వేగవంతం కానున్న వాణిజ్యం
- భారత్‌లో జపాన్ కంపెనీలకు ప్రోత్సాహం.. పెరగనున్న ప్రైవేట్ పెట్టుబడులు



- త్వరలో ఆర్‌బీఐ, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య అవగాహన ఒప్పందం

2లో

## ప్రత్యేక సందేశంతో సీషెల్స్ నేతలకు

# మోదీ అరుదైన కానుకలు



2లో

# ఇది రైతు ప్రభుత్వం



హైదరాబాద్: 'ప్రజా ప్రభుత్వం 30 నెలల పాలనలో రూ.1.75 లక్షల కోట్లు వెచ్చించి రైతులు ఆత్మగౌరవంతో బతికేలా చేసింది. వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దింది. ఈ ప్రభుత్వాన్ని కంచె వేసి కాపాడుకునే బాధ్యత మీదే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్షకులను ఉద్దేశించి అన్నారు. 'భారాస నేతలు బయలుదేరి కేసీఆర్‌ను మించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి రావాలని జనం కోరుకుంటున్నారట. ఎవరు కోరుకుంటున్నారు? అధికారంలో ఉండి ఆయన చేసిందేమీ లేదు. అన్ని సంస్కృతులనూ నాశనం చేశారు. ఆయన మళ్లీ వస్తే ఇంతకుముందు మాదిరే భార్యాభర్తల ఫోన్లు వినడం తప్ప ఏమీ చేయరు. మేము అలా వినం. ఆయన్ను తిరిగి అధికారంలోకి రానీయబోం. వస్తే రాష్ట్రమంతా ఆగమాగమవుతుంది' అని అన్నారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతుభరోసా పంపిణీ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''కేసీఆర్ తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకొని నిరుద్యోగులను మోసం చేశారు. మేం 30 నెలల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నాం. నాడు వరి వేస్తే.. ఉరే అని కేసీఆర్ బెదిరించి రైతుల పంటను కొనలేదు. ఆయన మాత్రం ఫామ్‌హౌస్‌లో వరి పండించి క్వింటాలు రూ.4,200 చొప్పున అమ్ముకున్నారు. అలాగే బెంగాల్ మాదిరిగా రాష్ట్రంలో భాజపా ఆటలు సాగవు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల, కేసీఆర్ పదేళ్ల పాలనలో... మా ప్రజాప్రభుత్వ 30 నెలల పాలనలో ఎవరేమి చేశారో చర్చించడానికి మేము సిద్ధం. దీని కోసం శాసనసభ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం.

**అప్పుల కుప్పగా అప్పగించారు**

2023 డిసెంబరు 7న ప్రజా ప్రభుత్వం ఏర్పాటునాటికి రూ.8.11 లక్షల కోట్ల అప్పు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో 19 మంది ముఖ్యమంత్రులు రూ.69 వేల కోట్ల అప్పులు చేస్తే కల్వకుంట్ల చంద్రశేఖరరావు రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి రాష్ట్రాన్ని నిండా ముంచారు. సర్పంచులకు నాడు రూ.వందల కోట్లు బకాయిలు పెట్టారు. దాని వల్ల చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. కేసీఆర్.. అప్పులతో పాటు అడ్డగోలుగా తప్పులు కూడా చేశారు. దిల్లీకి పోయే పరిస్థితి లేకుండా పోయింది. ఈ 30 నెలల్లో సమాజంలో గౌరవం పెంచుకుని, విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం. ఎప్పుడు ప్రజల్లోనే ఉంటున్నాం.

# పోరాడండి.. అధికారం మనదే!

హైదరాబాద్: రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వం అవినీతి, కుటుంబ పాలనలో మునిగితేలింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి ఆ ప్రభుత్వ పతనానికి ప్రధాన కారణమైంది. అదే పంథాలో ఇప్పుడు కాంగ్రెస్ నడుస్తోంది. అందుకే తెలంగాణలో కమలం వికసింపజేయాలనే సంకల్పంతో భాజపా కార్యకర్తలు ముందుకు సాగాలి. ఈనాడు, హైదరాబాద్: ''తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పాలన కొనసాగిస్తోంది. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం కన్నా దిల్లీ పెద్దలను సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరు గ్యారంటీలలో ఏవీ నెరవేర్చకపోగా.. తెలంగాణను ఏటీఎంలా మార్చుకుంటున్నారు' అని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్ విమర్శించారు. పార్టీ కార్యకర్తలంతా ప్రజల పక్షాన పోరాటం చేస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో భాజపా విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం తమ రాజకీయ లక్ష్యం మాత్రమే కాదని, ఎన్నో ఏళ్లుగా పార్టీ కార్యకర్తలు నిస్వార్థంగా చేసిన త్యాగాలకు, పోరాటాలకు తగిన ఫలితం అందించడం తమ బాధ్యతని పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ జాతీయ స్థాయి నేతలు, భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పదాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్‌నబీన్ మాట్లాడుతూ.. గత రెండు రోజుల రాష్ట్ర పర్యటన సందర్భంగా కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహం, ప్రజల నుంచి వస్తున్న స్పందనతో తెలంగాణలో భాజపా భవిష్యత్తు ఉజ్వలంగా ఉండబోతోందనే నమ్మకం కలిగిందని పేర్కొన్నారు. ''తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయలేదు. నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదు. మహిళలకు ఆర్థిక సాయం లాంటి హామీలేవీ నెరవేర్చలేదు. ప్రజల సమస్యలు పట్టించుకోవడం కన్నా రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చి.. దిల్లీ దర్బార్‌ను సంతోషపెట్టేందుకే ఇక్కడి పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్.ఆర్ ట్యాక్స్‌తో తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని దోచుకొని దిల్లీ పెద్దలకు తరలిస్తున్నారు. ఇటీవల మూసీ రివర్‌ఫ్రంట్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టులోనూ కాంగ్రెస్ సర్కారు అవినీతి సంప్రదాయాన్ని కొనసాగించింది'' అని నితిన్‌నబీన్ ఆరోపించారు.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

# ప్రత్యేక సందేశంతో సీషెల్స్ నేతలకు మోదీ అరుదైన కానుకలు

ప్రధాని నరేంద్ర మోదీ తన మూడు రోజుల సీషెల్స్ పర్యటనలో ఆ దేశ ఉన్నత స్థాయి నాయకులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. భారత గొప్ప సాంస్కృతిక వారసత్వం, కళా నైపుణ్యానికి అద్దం పట్టేలా ఈ కానుకలను ఎంపిక చేశారు. రెండు దేశాల మధ్య బలమైన స్నేహ బంధాన్ని, భాగస్వామ్య విలువలను ఈ బహుమతులు ప్రతిబింబిస్తున్నాయి. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినియేకు ప్రధాని మోదీ 'మురాదాబాదీ ఇత్తడి తాబేలు'ను బహూకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ఇత్తడి హస్తకళకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. అక్కడి నిపుణులైన కళాకారులు చేతితో దీనిని ఎంతో నైపుణ్యంగా రూపొందించారు. జ్ఞానం, స్థిరత్వం, దీర్ఘాయుష్షుకు తాబేలు ప్రతీక. ప్రపంచంలోనే అతిపెద్ద, ఎక్కువ కాలం జీవించే తాబేళ్లలో ఒకటైన 'అల్డాబ్రా జెయింట్ టార్టాయిస్'కు సీషెల్స్ ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సీషెల్స్ ప్రథమ మహిళ వెరోనిక్ హెర్మినియేకు 'బిద్రీవేర్ బాక్స్', 'మహేశ్వరి సిల్క్ శాలువా'ను ప్రధాని అందజేశారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బిద్రీవేర్ హస్తకళ చాలా ప్రత్యేకమైనది. నల్లటి లోహపు ఉపరితలంపై వెండి తీగతో చేసే సున్నితమైన నగిషీ పనితనం ఇందులో కనిపిస్తుంది. అలాగే, మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌కు చెందిన మహేశ్వరి సిల్క్ శాలువా తేలికైన బరువు, నాణ్యమైన పట్టు, కాటన్ నూలుతో చేసిన నేతకు ప్రసిద్ధి. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లేకు సిక్కింకు చెందిన 'ఆర్కిడ్ పెయింటింగ్'ను, ఆయన అర్ధాంగి లీనా పిళ్లేకు 'కంచివరం పట్టు వస్త్రాన్ని' బహూకరించారు. ఈ పెయింటింగ్‌లో భారత జాతీయ పక్షి నెమలిపై సీషెల్స్ జాతీయ పుష్పం ఆర్కిడ్‌ను అందంగా చిత్రించారు. ఇది ప్రకృతి పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల రెండు దేశాలకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన కంచి పట్టు తన నాణ్యత, మన్నిక, బంగారు జరీ పనితనానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సీషెల్స్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టాకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివసించే తోడా గిరిజన తెగకు చెందిన 'తోడా ఎంబ్రాయిడరీ శాలువా'ను మోదీ బహూకరించారు. తెలుపు రంగు కాటన్ వస్త్రంపై ఎరుపు, నలుపు రంగు దారాలతో రేఖాగణిత ఆకృతులలో చేసే ఈ ఎంబ్రాయిడరీ ఆ తెగ కళాత్మక వారసత్వానికి చిహ్నం. ఈ బహుమతుల ద్వారా రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని, స్నేహాన్ని మరింత పటిష్టం చేసే ప్రయత్నం చేశారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో 20 వేల మంది అక్రమ వలసదారులు

హైదరాబాద్ : అక్రమ వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ హెచ్చరిక నేపథ్యంలో వివరాలు ఆరా తీస్తున్న అధికారులకు విస్తుబోయే విషయాలు బహిర్గతమవుతున్నాయి. ఒకరుకాదు.. ఇద్దరు కాదు.. అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన విదేశీయులు వేలల్లో ఉన్నారు. ఆఫ్రికా దేశాలకు చెందిన వారే 1,400 మందికి పైగా ఉన్నట్లు అధికారుల అంచనా. రోహింగ్యాల సంఖ్య సుమారు తొమ్మిదిన్నరవేలని, బంగ్లాదేశీయుల సంఖ్య అధికారికంగా 40 ఉంటే అక్రమంగా వచ్చిన వారి సంఖ్య 4 వేలకుపైనేనని లెక్కేస్తున్నారు. అక్రమంగా ప్రవేశించారంటే వారి వివరాలు ఎక్కడా రికార్డుల్లో నమోదు కావు. నిఘా వర్గాల సమాచారం ప్రకారమే ఈ జాబితా రూపొందించగా వాస్తవంలో ఇంతకంటే ఎక్కువగానే ఉండవచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. బతుకుదెరువు కోసం వచ్చిన వారి విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ అక్రమంగా దేశంలోకి ప్రవేశించడం నేరమే కాబట్టి రోహింగ్యాలు మినహా మిగతా వారిని గుర్తించి, వారివారి దేశాలకు పంపేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. చాలామంది బతుకుదెరువు కోసం వచ్చినప్పటికీ ఆఫ్రికా దేశాలకు చెందిన వారిలో పలువురు మత్తుమందుల వ్యాపారంలో మునిగితేలుతున్న విషయం తెలిసిందే. ఈగల్ అధికారులు మాదకద్రవ్యాల కేసులో 2025లో ఆఫ్రికా దేశాలకు చెందిన 24 మందిని అరెస్టు చేశారు. అంతకు ముందు అరెస్టు చేసిన వారితో కలుపుకొని మొత్తం 42 మందిని వారి దేశాలకు డిపోర్టేషన్ చేశారు.

# భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.. తెలంగాణలో సర్వర్లు డౌన్!

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈకేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# జీవితాన్ని తీర్చిదిద్దేదే నిజమైన విద్య

(మొదటిపేజీ తరువాయి)

స్నాతకోత్సవం కాదు, ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక" అని అభివర్ణించారు.

*** అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి**

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, అన్ని వర్గాలు భాగస్వాములైనప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని లోకేశ్ తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలుగా కాకుండా, సామాజిక పరివర్తనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే, ఆ కుటుంబంతో పాటు దేశం కూడా పురోగమిస్తుంది. మన గిరిజన వారసత్వాన్ని కాపాడుకుంటూ, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే వికసిత్ భారత్ స్ఫూర్తి" అని ఆయన వివరించారు.

*** ఏఐ యుగంలో మానవ విలువల ప్రాధాన్యం**

ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో మానవ విలువల ప్రాధాన్యతను లోకేశ్ నొక్కిచెప్పారు. "ఏఐ మనకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వం వంటి లక్షణాలను ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అందుకే వర్సిటీలు నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను తయారు చేయాలి" అని ఆయన ఆకాంక్షించారు.

*** భవిష్యత్ నాయకులను తయారు చేస్తాం**

ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలే కీలకమని లోకేశ్ అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు తెలుపుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. "మా లక్ష్యం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడం. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి వర్సిటీ ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "డిగ్రీ మీకు వృత్తిని ఇస్తుంది, కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదిస్తుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు శాశ్వత వారసత్వాన్ని అందిస్తుంది" అని హితవు పలికారు. అంతకుముందు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్–జపాన్ ఆర్థిక మైత్రి: డాలర్‌కు చెక్!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (nonresidents) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (RBI), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్‌జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

# జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది

*** జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలో 78 శాతం,మహబూబాబాద్ నియోజకవర్గంలో 78 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో రెండు నియోజకవర్గాల్లో వంద శాతం ఫారాల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు.ఫారాల పంపిణీ అనంతరం రెండో విడత బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేస్తామని,అన్ని బీఎల్ఓలు ఫారం6 డిక్లరేషన్‌తో ఇంటింటికీ వెళ్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు... "ఎస్ ఐ ఆర్" సవరణ కార్యక్రమంలో డోర్నకల్ 267, మహబూబాబాద్ 288, మొత్తం 555 బిఎల్ఓ లు, సూపర్వైజర్లు 56, ఏఈఆర్ఓ లు 12 మంది, ఈ ఆర్ ఓ లు 2 మంది, జిల్లా వ్యాప్తంగా వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నామని, సర్వేకు వెళ్లే ముందు సిబ్బంది ఐడి కార్డు, క్యాప్, మెటీరియల్ తీసుకుని సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఆన్లైన్ లో ఎన్యూమరేషన్ ఫాం ఫిల్ చేయుటకు, 2002 జాబితాలో పేరు కొరకు voters.eci.gov.in ని సంప్రదించాలని లేదా ECINET app డౌన్లోడ్ చేసుకుని చూసుకోవచ్చు అని తెలిపారుఎస్ ఐ ఆర్ సవరణ ప్రక్రియ కార్యక్రమంలో ఎలా సందేహాలు వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1950 సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

## గ్రామపంచాయతీ సిబ్బంది కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



పాలకుర్తి / జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లోని మేజర్ గ్రామపంచాయతీ అయిన పాలకుర్తి లో పంచాయతీ సిబ్బంది కట్కూరి ఎల్లమ్మ అనారోగ్యం తో మృతి చెందడం పట్ల గ్రామ పాలకవర్గం సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భం గా సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ఎల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామపంచాయతీ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామ అభివృద్ధికి సేవ అందించిన ఆమె మరణం గ్రామానికి తీరని లోటు అని అన్నారు. భవిష్యత్తులో కూడా మృతురాలు కుటుంబానికి అవ సరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామ పాలకవర్గం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాదెపాక కిరణ్, వార్డు సభ్యులు సరేంద్ర కల్యాణి సందీప్, సరేంద్ర రామా సోమన్న, కమ్మగాని సుధాకర్ గౌడ్, నెమరుగొమ్ముల శ్రీనివాసరావు, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, ఎలుమకంటి స్వప్న సతీష్, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## వి బిజి రామ్ జీ పథకం పై నేడు జరిగే నిరసనలకు కెవిపిఎస్ మద్దతు

మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రేపు జరిగే విబిజి రామ్ జీ పథకాని కి వ్యతిరేక దేశ వ్యాప్తంగా నేడు జరిగే నిరసనలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉద్దేల రామ్మూర్తి అన్నారు. వీబీజీ రామ్ జీ (వికసిత భరత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ యోజన పథకం) ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పొందే ఉపాధిని దెబ్బ తీసిందని అన్నారు. ఉపాధి కూలీలకు ఉపాధి హక్కు నూతన పథకం ద్వారా బలహీనపడుతుందని అన్నారు. కొత్త పథకంలో నిధుల కేటాయింపును కేంద్రం నిర్ణయించే "నార్మేటివ్ అలొకేషన్" విధానం ప్రవేశపెట్టడం వల్ల గ్రామీణ కార్మికులకు పని హామీ తగ్గవచ్చని కేవీపీఎస్ భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర, నిర్ణయాధికారం తగ్గి, కేంద్ర నియంత్రణ పెరుగుతుందని కేవీపీఎస్ విమర్శిస్తోంది. ఈ కారణంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గ్రామీణ పేదలకు ఉపాధి భద్రత కల్పించిన మహాత్మా గ్రామీణ జాతీయ రూరల్ ఉపాధి హామీ పథకం ను రద్దు చేయకుండా, దానిని మరింత బలోపేతం చేయాలని కేవీపీఎస్ డిమాండ్ చేస్తోంది.

## సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షకు టీబీజీకేఎస్ సంఘీభావం

*** టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ**



కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ప్రాంతంలో కొత్తగూడెం ఏరియా కార్పొరేట్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి అధికారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షులు గడప రాజయ్య , తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దీక్షా శిబిరాల సందర్శనలో కాపు కృష్ణ , రాకేష్ రెడ్డి వారికి సంఘీభావం తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, అధ్యాపకులు, మహిళలు, విద్యార్థులు, అసంఘటిత కార్మికుల తో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసగించింది. కాంగ్రెస్ దుష్ట పాలన, అవినీతి చర్యలను మానుకోవాలని అధికారులు అడుగుతున్న న్యాయమైన కోరికలు తీర్చాలని పిఆర్పి ని వెంటనే ఇవ్వాలని, పే అప్గరేడేషన్ చేయాలనీ, సింగరేణి జెన్కో నుండి రావాల్సిన సుమారు 56 వేల కోట్లు ఉంటేనే చెల్లించాలని సింగరేణి కాపాడాలని అన్నారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వాసికార్ల కిరణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్,రవి వర్మ,బ్రాంచ్ కార్యదర్శి శివ,పిట్ కార్యదర్శిలు, వెంకటేష్,సూరజ్ , మోయ సూర్యనారాయణ, జయపాల్ ,బ్రాంచ్ కార్యదర్శి విద్య సాగర్, రాజకుమార్, రంజిత్,రాములు,వినయ్ ఖాజా,హైమద్, గౌరీ,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఉద్యోగికి..
# ఉద్యోగ విరమణ తప్పనిసరి

*** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీ లో మున్సిపల్ కమిషనర్ బాలాజీ పదవీ విరమణ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కౌన్సిలర్స్ పదవి కాలం పూర్తయిన సందర్భంగా వారికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఉద్యోగ విరమణ అనంతర జీవితంలో ఆరోగ్యంగా,ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బాలాజీని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ చైర్ పర్సన్ మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాలల్లో ప్రజలకు తమ వంతు సేవలు అందించామని, వారికి సహాయ సహకారాలు అందించిన అధికారులకు, నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గమంతా సమష్టిగా మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించారని మాజీ చైర్‌పర్సన్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ చంద్రకళ రాజేందర్ గౌడ్, కోస్గి శ్రీనివాస్,జయమ్మ జనార్ధన్ చారి, వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్, కర్ణ శ్రీ సుదర్శన్ గౌడ్,బ్యాగరి ప్రసన్న లత యాదయ్య,మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్,సీఐ నర్సయ్య, వైద్యాధికారి దీప్తి,సర్పంచులు కొమ్ము కృష్ణ,అశోక్, మాజీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మున్సిపాలిటీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైద్రాబాద్ శిల్పకళా వేదిక నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకాటి శ్రీహరి, అజారుద్దీన్ , జూపల్లి కృష్ణా రావు, తదితరలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ రైతుకు ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం జరిగింది, మహబూబాబాద్ పట్టణం లోని ఏటి గడ్డతండా రైతు వేదిక నుండి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,పాల్గొన్నారు, ఈ పథకం ద్వారా జిల్లాలోని 2 లక్షల 28 వేల 887 మంది రైతులకు 277 కోట్ల 61 లక్షల 29వేల 216 రూపాయల నిధుల లబ్ధి పొందుతున్నారు.మున్సిపల్ ఛైర్పర్సన్ గూగులోత్ జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియాన్న, ఎడిఎ శ్రీనివాస్ రావు, ఎల్డిఎం యాదగిరి, ఏఓ తిరుపతి రెడ్డి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు,విస్తరణ అధికారులు, ఉద్యాన అధికారులు, సెరికల్చర్ అధికారులు, సర్పంచులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల పై నష్కల్ గ్రామ పంచాయతీ కొరడా

*** మద్యపాన నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం**



చిల్పూర్/జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చిల్పూర్ మండలం నష్కల్ గ్రామం లో బెల్ట్ షాపుల పై నష్కల్ గ్రామ పంచాయతీ కొరడా. మద్యపాన నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం.అక్రమ బెల్ట్ షాపుల నియంత్రణకు గ్రామ పంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామం లో మద్యం విక్రయాలను అరికట్టేందుకు గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి నట్లు సర్పంచ్ శాతరబోయిన రాజు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరగడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడటంతో పాటు, మద్యపానం కారణంగా గొడవలు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు.ఇట్టి విషయం పై గ్రామస్థులు, మహిళలు, గ్రామ పంచాయతీ పాలక వర్గం,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మద్యం నియంత్రణకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ తీర్మానం ప్రకారం, గ్రామంలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తే రూ. 50 వేల జరిమానా విధించడంతో పాటు విద్యుత్, తాగునీరు, రేషన్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా,గ్రామం లో అక్రమ మద్యం విక్రయాలు నిర్వహించిన అంశంలో ఆరు ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు సమాచారం. ఇలాంటి చర్యలతో గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు పూర్తిగా నిలిచిపోతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డట్లు సమాచారం.

# భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: సమాజంలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులలో కీలకపాత్ర పోషిస్తున్న క్రొవత్తులా కరుగుతున్న భవన నిర్మాణ కార్మికులకు నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ రంగాల కార్మిక సంఘం (టి యు సి ఐ అనుబంధం హెచ్ 74) జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం అధ్యక్షుడు మళ్ళీకంటి వెంకన్న అధ్యక్షతన నేడు మహబూబాబాద్ లోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ అసంఘటిత రంగంగా కొనసాగుతున్న భవన నిర్మాణ కార్మిక లోకం కనీస హక్కులు తెలియకుండా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులోని నిధులు కార్మికుల సంక్షేమం కోసం కాకుండా అధికారుల సొంత అవసరాల కోసం, ప్రభుత్వం ఇతర రంగాల కేటాయింపులు చేస్తూ భవన నిర్మాణ కార్మికుల నోట్లో కొడుతున్నారు.నిర్మాణ కట్టడాలకు చెల్లించే సేజ్ సమకూరకుండా ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు కుట్ర చేస్తున్నారని అన్నారు. కొందరు లేబర్ అధికారుల చేతివాటం వల్ల కార్మికుల అందాల్సిన బెనిఫిట్స్ పెళ్లి కానుక,కాన్పు,సహజ, ప్రమాద మరణాలలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు.నిజమైన కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మంచి కంటి వెంకన్న తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన ఉప్పలయ్య ఉపాధ్యక్షులు నేరెళ్ల బలరాం,బీసీ యాకయ్య సహాయ కార్యదర్శి ధరావత్ సంతోష్ కుమార్, కోశాధికారి నెల్లుట్ల వెంకన్న జిల్లా కార్యవర్గ సభ్యులు ఏరగొండ ఉప్పలయ్య, వడ్లకొండ శ్రీను,లక్ష్మణ్ ప్రభాకర్ ఉపేందర్ సూరయ్య అరుణోదయ జిల్లా కార్యదర్శి ఈర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తదితర కార్మిక సమస్యలపై తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

# షాద్‌నగర్ లోని ప్రతి ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలి

*** షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వార్డుల బూత్ లో ,ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సందర్శించిన నాయకులు.షాద్‌నగర్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఓటరు భారత ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారిని కూడా అవగాహన కల్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, 6వార్డు కౌన్సిలర్ రాజు నాయక్, కిషోర్ యాదవ్, అగ్గనూర్ రవితేజ సురేష్, పరమేశ్వర్, బి ఎల్ వో, బి ఎల్ ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూమి బాట కోసం కలెక్టరేట్ కు రైతు పాదయాత్ర



స్టేషన్ ఘనపూర్/జనగామ, ప్రజాస్ఫూర్తి : వ్యవసాయ భూములకు వెళ్లే దారి కల్పించాలని కోరుతూ జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన రైతు వరాల రాజు గ్రామం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ తరతరాలుగా తమతో పాటు మరో పది మంది రైతు లు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు ఉపయోగిస్తున్న బాటను జిట్టబోయిన వెంకటయ్య అనే వ్యక్తి అడ్డుకుంటున్నా రని ఆరోపించారు. తన భూమి మీదు గా వెళ్లవద్దని అడ్డుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. ఇట్టి విషయంపై గ్రామ పంచాయ తీ సమక్షంలో సమావేశం నిర్వహించి రై తులకు దారి ఇవ్వాలని గ్రామ పెద్దలు తీర్మానించినప్పటికీ, సంబంధిత వ్యక్తి ఆ నిర్ణయాన్ని పాటించడం లేదని పేర్కొ న్నారు. దీంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రై తు పాదయాత్ర చేసి కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ వివాదంపై అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని బాధిత రై తు లు కోరారు.

## మేకను కాపాడబోయి మహిళ మృతి





బచ్చన్నపేట / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట మండలం చిన్న రాంచెర్ల లో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండా వాణి (33) మేకను రక్షించే ప్రయత్నంలో నీటి లో మునిగి మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం, గ్రామ సమీపంలోని వ్యవసాయ నీటి నిల్వ కొలనులో ఓ మే క పడిపోవడంతో దానిని కాపాడేందుకు వాణి కొలనులోకి దిగింది. ఈ క్రమంలో కాలుజారి నీటిలో పడిపోయిన ఆమెకు ఈత రాకపోవడంతో మునిగి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొలనులో నుండి తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## దూసకల్ గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయ పునః ప్రతిష్ట మహోత్సవం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్:దూసకల్ గ్రామంలో బాగం కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాలు గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ నిర్మాణం, పునః ప్రతిష్ట కోసం కృషి చేసిన బాగం కృష్ణయ్య యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించి, గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు భాగం కుమార్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు చాట్ల రమేష్, పాపయ్య యాదవ్, బాలు, కావలి అశోక్ యాదవ్, శివ కుమార్, కె. విష్ణు, కుమ్మరి రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, బి. నర్సింలు, మల్లెల రవి, శంకరయ్య యాదవ్, శివ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భూ క్రయవిక్రయాల్లో మ్యాపులను అప్డేట్ చేయాలి

* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం శివంపేట్ మండలం లోని బీక్యాతాండ లో ల్యాండ్ సర్వే డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో భూభారతి భూముల రిసర్వే గ్రామసభ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ,ఆర్డీవో ఎడి సర్వే ఎంపీడీవో గ్రామ సర్పంచ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ శివంపేట మండలం 1946 సంవత్సరంలో రిసర్వే అయిందని, అప్పటి నుంచి చాలా సమస్యలు ఉన్నాయన్నారు. భూమి క్రయవిక్రయాల్లో మ్యాపులను కూడా అప్డేట్ చేయాలన్నారు.గ్రామాల్లో భూ నక్షల్లో సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొందుపరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి కిషన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి

* **జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయం డీపీఓలో 1989 బ్యాచ్‌కు చెందిన సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సిబ్బందికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఒక ఉపాధి కాదని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే అత్యంత,బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు, ఎండా వానా తేడా లేకుండా, కుటుంబాలకు దూరంగా ఉండి విధులు



నిర్వర్తించే ప్రతి పోలీసు ఉద్యోగి సమాజానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో 1989 బ్యాచ్‌కు చెందిన ఈ సిబ్బంది అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.వారి క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం నేటి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ విధులకు మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, తమ అనుభవాన్ని యువతకు, సమాజానికి పంచుతూ మార్గదర్శకులుగా కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా 1989 బ్యాచ్‌కు చెందిన పదవీ విరమణ పొందిన జె.దిగంబర్ ఏఎస్ఐ ,భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ డి. బాబారావు,ఏఎస్ఐ , నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్, ఎం. బాలుడు ఏఆర్‌పీసీ , డీఏఆర్ నిర్మల్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను ప్రశంసిస్తూ సత్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏఓ ఎం.డి.యూనుస్ అలీ, ఆర్ఎస్ఐ శేఖర్,జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ.. ప్రతి ఉద్యోగికి జీవితంలో ఓ భాగమే

- **ఘనంగా లింగోజిగూడెం జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడు కూరెళ్ల శ్రీనివాసరావు పదవి విరమణ మహోత్సవం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ ఓ భాగమేనని పీ ఆర్ టి యూ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు మాధవ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరెళ్ల శ్రీనివాసరావు పదవి విరమణ మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ శ్రీనివాసరావు విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ముఖ్యంగా ఆయనలోని చిత్రకళా ప్రతిభ, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడంలో చూపిన అంకితభావం, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలోని పలువురు ప్రధానోపాధ్యాయులు, దాదాపు 15మంది రిటైర్డ్ హెడ్‌మాస్టర్లు కార్యక్రమంలో పాల్గొని శ్రీనివాసరావుకు ఘన సన్మానం చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, రెగ్యులారిటీ అలవాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, గ్రామ ప్రముఖులు శంకర్, శివారెడ్డి, రంగయ్య, సురేందర్ రెడ్డి, ముత్తయ్య, ఎల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ పరిధిలోని దిండి డివిజన్-8లో పదవీ విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, రికార్డు అసిస్టెంట్ శ్రీమతి నర్గీస్‌లను అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్‌జీవోస్ కోశాధికారి, నీటిపారుదల శాఖ ఉద్యోగుల సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు మేడి జయరావు జిల్లా టీఎన్‌జీవోస్ తరపున వారికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఉద్యోగ జీవితంలో వారు అందించిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి. రాములు, డీఏఓ మధుసూదన్, సూపరింటెండెంట్ జాఫర్ సాబ్, డీఈఈలు ప్రభాకర్, మనోహర్, శ్రీనివాసరావు, హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ గోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు రాజేష్, నాగేశ్వరరావు, రవి తదితరులతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అభినందించారు.

# ఆరు మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం

పాలకుర్తి/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని పాలకుర్తి నియోజకవర్గ పరిధి లోని ఆరు మండలాలకు కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులను టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియమించిన్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి లక్ష్మీనారాయణ నాయక్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నియా మకాల వివరాలు ఇలా ఉన్నాయి.పాల కుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి గా పోగు శ్రీనివాస్, దేవరుప్పుల మండ ల అధ్యక్షుడిగా దావేర అనిల్ కుమార్, కొడకండ్ల మండల అధ్యక్షుడిగా ధారావ త్ సురేష్ నాయక్, రాయపర్తి మండల అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి, తొర్రూర్ మండల అధ్యక్షుడిగా రవీంద్రాచారి, పెద్దవంగర మండల అధ్యక్షుడిగా రంగు మురళిని నియమించారన్నారు. నూత నంగా నియమితులైన మండల అధ్య క్షులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు.

## జిల్లా సంక్షేమ శాఖ అధికారి

# నరసింహారావుకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

భువనగిరి, ప్రజాస్ఫూర్తి: నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు చేసినసేవలు ప్రశంసనీయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శప్రాయులని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సంక్షేమ శాఖ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు విశేష సేవలు అందించారని



కొనియాడారు. జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి ఎంతో కృషి చేశారని, అనేక సంఘటనలలో కలిసిమెలిసి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగిందన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన , అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు.అనంతరం శాలువాలతో పాటు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ శాఖ సిబ్బంది , కుటుంబ సభ్యులు,పాల్గొని నరసింహారావు కి శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలను అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విరమించాలి

: **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజల జీవనం రోజురోజుకు మరింత భారంగా మారుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి జహంగీర్ విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామం చీకోటి విజయలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న సిపిఎం చౌటుప్పల్ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం కొనసాగాయి. ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి జహంగీర్ హాజరై, మాట్లాడారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను పదేపదే పెంచడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయని చూపించారు. పెరుగుతున్న ధరల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు నిత్యావసర వస్తువులను కూడా కొనలేని దుస్థితిలో




ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా వ్యతిరేక విధానాలను విరమించి, ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరు బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగీరు కిష్టయ్య, గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, గడ్డం వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, అంతటి అశోక్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధు కృష్ణ, ఎలమంచి సంజీవ, బోదాసు వెంకటేష్, కొండే శ్రీశైలం, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, బత్తుల శ్రీశైలం, గోపనబోయిన లక్ష్మణ్, ఆకుల ధర్మయ్య, పర్నె ధర్మారెడ్డి, ఎండి ఖయ్యూం, గుండబోయిన రాములు, ఐలయ్య కృష్ణ, రత్నం శ్రీకాంత్, కొంతం శ్రీనివాస్ రెడ్డి, నేరేడు మహేష్, యాట బాలరాజు, ఇట్టబోయిన శేఖర్, చప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఉష్కాగుల శీను, రమేష్, తీగుల్ల శ్రీనివాస్, జంగం అంజయ్య, రాపోలు పద్మ, చెరుకు రమేష్, చింతల మధు, గౌర్రె మల్లారెడ్డి, మంద పల్లె సత్యం, చేకూరి ఈదయ్య, బుచ్చిరెడ్డి, విగ్నేష్ రెడ్డి, యాట సుధాకర్, కస్తూరి లింగస్వామి, యాట ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన ప్రతి పంటను

# కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

* **జొన్నల కొనుగోలు చేయాలని రైతులతో కలెక్టరేట్ ముందు ధర్నా**
* **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: జొన్నలు పండించిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని,అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడబోమని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి రైతుల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతేపల్లి, కాట్రియల, పర్వతాపూర్, కిషన్ తండా, జాప్లా తండా గ్రామాలకు చెందిన రైతులు జొన్నల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి రైతులతో కలసి ధర్నా నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. జొన్నలను కొనుగోలు



చేసిన అనంతరం మట్టి పెల్లలు ఉన్నాయనే కారణంతో మార్క్‌ఫెడ్ అధికారులు తిరిగి వెనక్కి పంపడాన్ని నిరసిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన జొన్నలను నాణ్యత పేరుతో, మట్టి పెల్లలు ఉన్నాయనే సాకుతో తిరిగి రైతులకే అప్పగించడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులు మార్కెట్‌లో సరైన ధర లేక, ప్రభుత్వ కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.అనంతరం మార్క్‌ఫెడ్ డిఎం, బాలకృష్ణ డిఆర్ఓ అంబదాస్ జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ఈ ధర్నాలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి రూ.12.50 కోట్లతో అత్యాధునిక ఎంఆర్ఐ కేంద్రం

* **హైదరాబాద్ నుండి సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభం..**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. జిల్లా ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో రూ.12 కోట్ల 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఎంఆర్ఐ కేంద్రాన్ని ప్రారంభించే సమయంలో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు , జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొనడం విశేషం. సీఎం చేతుల మీదుగా ప్రారంభం పూర్తికాగానే భూపాలపల్లి జిల్లా ఆసుపత్రిలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గతంలో జిల్లా ప్రజలు ఎంఆర్ఐ పరీక్షల కోసం ఇతర నగరాలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు రూ.12.50 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక ఎంఆర్ఐ కేంద్రం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ ఎంఆర్ఐ కేంద్రం ద్వారా మెదడు, వెన్నెముక, గుండె, కీళ్ల వ్యాధులతో పాటు పలు క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్ధారించే అవకాశం ఏర్పడనుంది. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరత్నం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ కంబాల శ్రీనివాస్, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాటారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ సంకీర్త్..

* **ప్రజలకు మరింత మెరుగైన సేవలపై దృష్టి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి :వార్షిక తనిఖీల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మంగళవారం కాటారం పోలీస్ స్టేషన్‌తో పాటు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను ప్రత్యక్షంగా అంచనా వేయడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. తనిఖీల సందర్భంగా "వన మహోత్సవం"లో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కరించేలా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ సంకీర్త్ స్పష్టం చేశారు/

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎంపీ సహకారం అభినందనీయం

*** మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎంపీ సహకారం అభినందనీయమని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ నిర్మాణ పనులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో చాలా కాలంగా ఉన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్‌వెల్ నిర్మాణానికి నిధులు కేటాయించిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రజల అవసరాలపై స్పందించి నిధులు కేటాయించిన ఎంపీ ఈటెల రాజేందర్‌కు, పనులు ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ భగత్ సింగ్ కాలనీ కన్వీనర్ మహేశ్వరి, సీపీఐ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సిపిఐ నాయకులు బొందయ్య, చంద్రయ్య, నరేష్, మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు నరసింహ చారి, యాదగిరి, రామకృష్ణ, పవన్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన సన్మానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం కర్తవ్యనిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ రిటైర్డ్ అధికారులను అభినందించి, వారి సేవలను కొనియాడారు. పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, కుటుంబ సౌకర్యాలను పక్కనబెట్టి ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించడం పోలీసు సిబ్బంది ప్రత్యేకత అని ఎస్పీ పేర్కొన్నారు. అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించిన అధికారుల సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన *ఎం.డి. షాఖాన్ (ఎస్సై), పులియాల రాజిరెడ్డి (ఎస్సై), రాజారపు వెంకటరత్నం (ఏఎస్ఐ)*లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన సిబ్బందికి గౌరవం ఇవ్వడంతో పాటు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కూడా ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# ఘనంగా ఆర్టిసి ఉద్యోగుల పదవి విరమణ సన్మాన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి జీవితంలో భాగమేనని ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబంతో సంతోషంగా గడపాలని సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఉట్కూరు సునీత అన్నారు. మంగళవారం సూర్యాపేట డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎంఎ రజాక్, ఎండి మునీర్, సోమ శ్రీనివాస్ , మార్తినేని సుధీర్ రావుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సునీత మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగం అంటేనే చాలా శ్రమతో కూడుకున్నదని ఎప్పుడు ఎటువంటి ఇబ్బందులు వస్తాయో తెలవదని, దాదాపు 30 సంవత్సరాలు ఆర్టీసీలో పనిచేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. పదవి విరమణ తరువాత ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్ లు వారికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పదవి విరమణ చేస్తున్న ఉద్యోగుల దంపతులను డిపో మేనేజర్ , సూపర్వైజర్లు ఘనంగా శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ ధనమ్మ, ఏకాంబరం, కార్మిక సంఘాల నాయకులు సుంకరి శ్రీనివాస్, బత్తులసుధాకర్ , ఎన్సిహెచ్ సైదులు, బెల్లి నరసయ్య, లింగయ్య, ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సమరభేరి' సభకు ప్రముఖ నాయకులకు ఆహ్వానం



జనగామ జిల్లా, ప్రజాస్ఫూర్తి :తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 5వ తేదీన భువనగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'రాజ్యాధికార సమరభేరి' మహాసభకు జనగామ జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం ఆధ్వర్యంలో మంగళవారం పలువురు ప్రముఖ కార్మిక, సామాజిక సంఘాల నాయకులను సభకు హాజరుకావాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. సభ జయప్రదం కావాలని కోరుతూ.. జనగామ ఆర్టిఓ శిల్పా కి, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ కు, రఘునాథపల్లి మండల బీసీ జేఏసీ నాయకులు చింతకింది కృష్ణమూర్తి ,ముత్యాలు గుగులోతు కొమురెల్లి వెల్ది ఉపసర్పంచ్ ఎడ్ల భాస్కర్ సంఘాల ముఖ్య నాయకులకు పార్టీ నాయకులతో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న గారి నాయకత్వంలో, అమరుల ఆశయాల సాక్షిగా, బీసీల ఆత్మగౌరవం మరియు బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఈ మహాసభ జరుగుతోందని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా, మన హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆహ్వానం అందుకున్న నాయకులు సానుకూలంగా స్పందిస్తూ సభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్ష పోరాటానికి తొలి విజయం

**: చౌటుప్పల్‌లో మౌంట్ లిటెరా జీ స్కూల్ సీజ్**

*** నిబంధనలు ఉల్లంఘించే ప్రతి ప్రైవేట్ పాఠశాలపై ఇదే తరహా చర్యలు తప్పవు**

*** అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల హెచ్చరిక**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలంలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్వహించబడుతున్న మౌంట్ లిటెరా జీ స్కూల్‌పై మండల విద్యాధికారి చర్యలు తీసుకుని పాఠశాలను సీజ్ చేయడం అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఐక్య పోరాటానికి తొలి విజయంగా నిలిచిందని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలు, అధిక ఫీజుల దోపిడీ, ప్రభుత్వ జీవోల ఉల్లంఘన, అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలను నడపడం, విద్యార్థులు, తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి సమస్యలపై అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ఇటీవల ఐక్యంగా ఉద్యమాన్ని ప్రారంభించాయి. ముందుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో అధికారులు వెంటనే స్పందించకపోవడంతో, మౌంట్ లిటెరా జీ స్కూల్ ఎదుట అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ధర్నా సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్రమ పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమం ఉధృతం కావడంతో మండల విద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాలను తనిఖీ చేశారు. తనిఖీలో పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అనంతరం మౌంట్ లిటెరా జీ స్కూల్‌ను సీజ్ చేస్తూ చర్యలు చేపట్టారు. అఖిలపక్షం చేపట్టిన ధర్నా ఫలితంగానే అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి చర్యలు తీసుకోవడం ప్రజా ఉద్యమం సాధించిన తొలి విజయమని నాయకులు తెలిపారు.

*** అయితే ఇది అంతిమ విజయం కాదని, అసలు పోరాటం ఇప్పుడే ప్రారంభమైందని పేర్కొన్నారు.**

ఈ సందర్భంగా అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, పల్లె మధు, కొండూరు వెంకన్న, బండి గారి శ్రీధర్ గౌడ్, పబ్బు వంశీ, తిగుళ్ల శీను, ఒంటెద్దు లింగస్వామి, ఖయ్యూం, రాఘవులు మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘించి విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలకు ఇది గట్టి హెచ్చరిక అన్నారు. ప్రజలు ఐక్యంగా పోరాడితే అధికారులు కూడా చర్యలు తీసుకోవాల్సిందేనని, ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఏ యాజమాన్యాన్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం



చేశారు. విద్య అనేది సేవ కావాలని, వ్యాపారం కాదని, తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని అధిక ఫీజులు వసూలు చేయడం, బలవంతపు పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర పేర్లతో వసూళ్లు చేయడం పూర్తిగా ఆగాల్సిందేనన్నారు. చౌటుప్పల్ మండలంలో ఇంకా అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని, అలాంటి ప్రతి పాఠశాలపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేసి, అవసరమైతే సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు ఒక పాఠశాలపై చర్య తీసుకోవడంతో బాధ్యత పూర్తయిందని భావించకుండా, మండలవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలను సమగ్రంగా పరిశీలించాలని, ఎక్కడ అక్రమాలు కనిపించినా రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎలాంటి యాజమాన్యానికీ ప్రత్యేక మినహాయింపులు ఉండకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా భయపడకుండా తమకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాలు వారికి అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ నిబంధనల అమలు, ఫీజుల దోపిడీ నిర్మూలన కోసం చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈరోజు మౌంట్ లిటెరా జీ స్కూల్‌పై చర్యలు తీసుకున్నట్లే, రేపు నిబంధనలు ఉల్లంఘించే మరో పాఠశాలపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. చౌటుప్పల్ మండలంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాల చట్టబద్ధంగా పనిచేసే వరకు, విద్యారంగంలో జరుగుతున్న అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట పడే వరకు అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఉద్యమం మరింత ఉధృతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పక్ష నాయకులు అన్నెబోయిన సూర్య, పందుల శరత్, గట్టు పవన్, సన్నీ, సాయి కిరణ్, కొప్పు రామకృష్ణ, నవీన్, భాను, శివ, శైలేందర్, ప్రవీణ్, నవీన్, మనోజ్, ప్రవీణ్, సుకుమార్ రెడ్డి, సాయి, శివ, రాకేష్, ఇర్ఫాన్, ప్రమోద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా స్వేచ్ఛను హరిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్

*** వీడియోలు, ఫోటోలు తీయవద్దంటూ హుకుం జారి**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా : మెదక్ మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ రాధిక అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నూతన మున్సిపల్ కమిషనర్ నవీన్ కౌన్సిలర్స్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ సమావేశం ప్రారంభం అవ్వగానే మీడియా వాళ్లు వీడియోలు, ఫోటోలు తీయవద్దంటూ చైర్ పర్సన్ కానుగు రాధిక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారిదిగా ఉన్న మీడియాపై ఎందుకింత చిన్నచూపు చూస్తున్నారు. మున్సిపల్ లో ఏం జరుగుతుందో పట్టణ ప్రజలకు తెలియాల్సిన అవసరం లేదా..? వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు ఏ సమాధానం ఇస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 9 వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ సమావేశంలో మీడియా ప్రతినిధులు ఫోటోలు, వీడియోలు తీయవద్దని చెప్పడం వారి హక్కులను హరించడమేనని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో చైర్‌పర్సన్ రాధిక తన పేరును పొరపాటున షమీ గా సంబోధించగా, నా పేరు జుబేర్ మేడం అని ఆయన సరిదిద్దారు. కౌన్సిలర్ పేరు గుర్తు లేకపోవడంపై సమావేశంలో చర్చించారు. 29 వ వార్డు కౌన్సిలర్ బట్టి ఉదయ్ మాట్లాడుతూ మీడియాపై ఆంక్షలు విధించడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే సమావేశాల్లో వీడియోలు తీయడానికి మీడియాకు అనుమతి ఇవ్వాలని కోరారు. తమ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి అమృత్ పథకం నిధులను వినియోగించాలని సూచించారు. వార్డు సమస్యలపై మాట్లాడానికి కమిషనర్ కు ఫోన్ చేస్తే కనీసం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో చైర్మన్ కు, అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపాలిటీకి సొంత జేసీబీ ఉన్నప్పటికీ ప్రైవేట్ జేసీబీ కి 2 లక్షలు ఖర్చు చేశారని ఆరోపించారు. అలాగే పంచర్ మరమ్మతులకు 40 వేల, ఈ నెల 20 వేలు ఖర్చు చేయడాన్ని చూస్తూ కౌన్సిలర్ కంటే పంచర్ షాప్ పెట్టుకున్నది బెటర్ అని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కౌన్సిలర్ గౌస్ ఖురేషి మాట్లాడుతూ గత సమావేశంలో తమ వార్డును పరిశీలిస్తామని చెప్పిన చైర్‌పర్సన్, కమిషనర్ ఇప్పటి వరకు రాలేదన్నారు. వర్షాకాలంలో తమ వార్డులోని చమన్ ప్రాంతంలో చిన్న వర్షానికే మోకాలి లోతు వరకు నీరు నిలుస్తోందని, వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. బోనాల సందర్భంగా అన్ని బ్యానర్లు తొలగించి ఒక బ్యానర్ మాత్రమే ఉంచడం సరైంది కాదన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలని సూచించారు. కౌన్సిలర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ మనిషి చనిపోయాడు అని మున్సిపల్ వాటర్ ట్యాంక్ పంపించమని అడుగుతే, చనిపోయిన వ్యక్తి వీడియో తీసి పంపిస్తేనే వాటర్ ట్యాంక్ పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఉన్న శివాజీ విగ్రహం చుట్టూ అభివృద్ధి పనులు చేయాలని తెలిపారు. గోదాల మానస మాట్లాడుతూ తమ వార్డులో నీటి సమస్య ఉందని ఎన్ని రోజులు అయినా నీటి సమస్య తీరడం లేదని వార్డు ప్రజలు నీటి పన్నులు ఎలా కట్టాలని ప్రశ్నిస్తున్నారన్నారు. పాత పనుల పైన దృష్టి పెట్టడం కాకుండా మెదక్ పట్టణంలో కొత్తగా ఏమైనా చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ గంగమని మాట్లాడుతూ మల్లెం చెరువు కట్టపై స్మశాన వాటిక దగ్గర శాశ్వత నీతి పరిష్కారం చేయాలన్నారు. చెరువు కట్ట పైన వీధి దీపాలు లేక చీకటిలోనే దహన సంస్కారాలు చేస్తున్నారని చీకటిలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నవీన్, కౌన్సిలర్స్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో చదవండి.. తల్లి దండ్రుల కలలను సాకారం చేయండి"

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



దేవరుప్పుల / జనగామ, ప్రజస్ఫూర్తి : విద్యార్థులు ప్రతి కాన్సెప్ట్‌ను పూర్తిగా అర్థంచేసుకొని ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం దేవరుప్పుల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ విద్యాబోధన, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వంటశాల, ఆర్‌ఓ ప్లాంట్, స్టోర్ రూమ్ ను తనిఖీ చేసి విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత పాటించడం తోపాటు చెడిపోయిన ట్యాపులను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. తరగతి గదులు సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించి, స్వయంగా బోధించారు. పదో తరగతి విద్యార్థులకు అన్ అకాడమీ ఉచిత డిజిటల్ తరగతులను ప్రారంభించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రత్యేక పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహుమతిగా అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. పాఠశాలలో బ్యాడ్మింటన్ కోర్టు, టేబుల్ టెన్నిస్ సదుపాయాలు ఏర్పాటు చేసి విద్య తోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో విద్యా శాఖ ఏ.డీ శ్రీనివాస్, తహసీల్దార్ అహ్మద్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన కలెక్టర్.. పర్శ సాయి కుటుంబానికి టాటా ఏసీతో జీవనోపాధి



జనగామ, ప్రజస్ఫూర్తి : అంగవైకల్యం తో బాధపడుతున్న పట్టణానికి చెందిన పర్శ సాయి కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మానవతా దృక్పథంతో స్పందించి టాటా ఏసీ వాహనాన్ని మంజూరు చేయించారు. ఇందుకోసం రూ.4 లక్షల విలువైన చెక్కు ను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పర్శ సాయి తల్లిదండ్రులగు, పర్శ లక్ష్మి సాయి మల్లయ్య కు అందజేశారు. ఇటీవల పర్శ సాయి తల్లి దండ్రులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించి, జీవనోపాధి కోసం సహాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కుటుంబ పరిస్థితిని, అంగవైకల్యం కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి టాటా ఏసీ వాహనం మంజూరుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమేనని అన్నారు. ప్రభుత్వం అందించిన టాటా ఏసీ వాహనాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని, వాహనం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఆ ఆదాయాన్ని కుటుంబ అవసరాలు, ఇంటి ఖర్చులు, పర్శ సాయి సంరక్షణ కోసం వినియోగించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ అందించిన సహాయం పై సాయి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ వినతికి వెంటనే స్పందించి జీవనోపాధి కల్పించిన కలెక్టర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పల్లె నుంచి జాతీయ స్థాయి వేదిక వరకు

# డాక్టర్ అక్షయ్ కుమార్ సేవలకు అరుదైన గౌరవం



ప్రజాస్ఫూర్తి, భైంసా: ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న డాక్టర్ నాంపల్లి అక్షయ్ కుమార్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దంత వైద్యుడిగా సేవలందిస్తూ, ప్రజల్లో దంత ఆరోగ్యంపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఒక చిన్న ఆలోచన ఎంతో మందికి చిరునవ్వును అందించింది. ప్రజల ఆరోగ్యం కోసం చేసే సేవే లక్ష్యంగా ముందుకు సాగిన డాక్టర్ నాంపల్లి అక్షయ్ కుమార్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. నాంపల్లి నాగభూషణ్, లింగేశ్వరి దంపతుల కుమారుడైన అక్షయ్ కుమార్ చిన్ననాటి నుంచే వైద్య రంగంపైఆసక్తిపెంచుకున్నారు. కష్టపడి వికారాబాద్‌లోని శ్రీ సాయి డెంటల్ కళాశాలలో దంత వైద్య విద్యను పూర్తి చేశారు. తర్వాత దంత వైద్యుడిగా సేవలు ప్రారంభించిన ఆయన, చికిత్సకే పరిమితం కాకుండా ప్రజల్లో దంత ఆరోగ్యంపై అవగాహన పెంచాలని సంకల్పించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలలో ఉచిత దంత ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మందికి సేవలు అందించారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించి, ఎన్నో కుటుంబాల్లో చిరునవ్వులు నింపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ముంబైలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "స్మైల్ వర్స్ 2026 కమ్యూనిటీ హెల్త్ ఇంపాక్ట్" అవార్డు అందుకున్నారు. గత ఏడాది కుబీర్ మండలంలోని నిగ్వ ప్రభుత్వ పాఠశాలలో కూడా దంత వైద్య విద్యార్థులతో కలిసి విద్యార్థులకు దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఆయన సేవాభావానికి నిదర్శనం. ప్రజల ఆరోగ్యమే తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్న డాక్టర్ అక్షయ్ కుమార్ ప్రయాణం యువ వైద్యులకు ఆదర్శంగా నిలుస్తోంది.

# తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం జిల్లా నూతన కమిటీ ఏర్పాటు




ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మారేపల్లి వెంకట్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగినది. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశం జరిగింది. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం (టిపియుఎస్ )జిల్లా అధ్యక్షుడిగా అప్పని శంకర్ రావు ను నియమించినట్లు ఆ సంఘం ఇంచార్జ్ మారేపల్లి వెంకట్ మరియు రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అప్పని శంకర్ రావు మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే సంఘ సభ్యత్వాన్ని , పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ మారేపల్లి వెంకట్ మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగుల భద్రత,పనికి తగ్గ వేతనం ,ఈఎస్ఐ ఈపిఎఫ్, ప్రైవేట్ ఉద్యోగుల పెన్షన్, మహిళల రవాణా సౌకర్యం కల్పించాలన్నారు ఈ Jకార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కోటి, సెక్రటరీ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కంభంపాటి రాజారత్నం, పట్టణ కార్యదర్శి షేక్ రాజిఖ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసిన కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన ప్రధాన కార్యదర్శికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా అంశాలు, జిల్లాలో కొనసాగుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిపై సీఎస్‌కు వివరించారు.జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. సీఎస్ సంజయ్ జాజు జిల్లా పరిపాలనపై ఆరా తీసి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించినట్లు సమాచారం.



# పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

**: కార్యదర్శి ముత్యాలు**

వలిగొండ,ప్రజాస్ఫూర్తి : పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని సహకార పరపతి సంఘం కార్యదర్శి బోనగిరి ముత్యాలు అన్నారు అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా మంగళవారం వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మొక్కలను నాటారు ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ మొక్కలు పర్యావరణానికి ఎంతో దోహదపడతాయని ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్క మొక్కనైన నాటాలని ఆయన కోరారు రోజురోజుకు పొల్యూషన్ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో దాని నివారణకు మొక్కలు ఎంతో అవసరమని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిబ్బంది బుగ్గ అమరేందర్ మల్లారెడ్డి గర్దాస్ వంశీ కిషోర్ దిలీప్ కుమార్ రైతులు పాల్గొన్నారు.





# 30 దాటిందా? ఈ ఆరోగ్యసూత్రాలు పాటించండి

**30 ఏళ్ల వయసు పడిన తర్వాత అధిక శాతం మంది పురుషులకు బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగం, కుటుంబం, పిల్లలు ఇలా పూర్తిగా బిజీ అయిపోతారు. తీరిక లేకుండా కాలం గడిచిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ఆ వయసు తర్వాత చాలా మంది తమ శరీరం గురించి పెద్దగా పట్టించుకోరు. పెద్దగా జాగ్రత్తలు తీసుకోరు. అయితే, 30 ఏళ్ల వయసు తర్వాత పురుషుల తప్పకుండా కొన్ని విషయాలపై దృష్టి పెట్టాలి. అలా అయితేనే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే రిస్క్ తగ్గుతుంది. అలా 30 ఏళ్ల తర్వాత పురుషులు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు ఏవో ఇక్కడ తెలుసుకోండి.**

**గుండెపై ప్రత్యేక శ్రద్ధ**

30 ఏళ్ల వయసు దాటిన తర్వాత పురుషులు గుండె ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎందుకంటే ఆ తర్వాతే గుండె వ్యాధుల రిస్క్ పెరుగుతుంది. బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ పెరగడం లాంటి సమస్యలు గుండెను దెబ్బతీస్తాయి. అందుకే ముందుగా అవి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలు ఉండే ఆహారంతో పాటు వ్యాయామాలు చేయాలి. తరచూ బీపీ, కొలెస్ట్రాల్ చెక్ చేసుకుంటూ ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించి.. దాన్ని పరిష్కరించుకునే దిశగా కృషి చేయాలి. ఆరోగ్యం విషయంలో అసలు నిర్లక్ష్యం చేయకూడదు.

**మానసిక ఆరోగ్యం**

బాధ్యతలు పెరగడంతో 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు ఒత్తిడికి గురవుతుంటారు. కొందరికి ఆందోళన ఉంటుంది. అయితే, ఈ వయసు తర్వాత మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. అన్ని విధాల ఆరోగ్యంగా ఉండేందుకు ఇది కీలకం. అందుకే ధ్యానం, యోగా, బ్రీత్ ఎక్సర్‌సైజ్‌ల్లాంటివి ప్రతీ రోజు చేయాలి. ఒత్తిడి లేకుండా జీవనం సాగించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

**రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు**

30 ఏళ్లు దాటిన పురుషులు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ లెవెల్స్, గుండె ఇలా అవసరమైన హెల్త్ చెకప్స్ చేయించుకోవాలి.

**పొట్ట రాకుండా..**

చాలా మంది పురుషుల్లో 30 ఏళ్ల తర్వాత వచ్చే సమస్య ఊబకాయం. ఇది చాలా సమస్యలకు దారి తీస్తుంది. బరువు పెరిగి ఊబకాయం వస్తే డయాబెటిస్ రిస్క్ పెరుగుతుంది. కొలెస్ట్రాల్ అధికమై గుండెకు ముప్పు ఏర్పడుతుంది. అందుకే పొట్ట పెరగకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంత బిజీగా ఉన్నా ఉదయాన్నే వ్యాయామం చేయాలి. ఓ సరైన డైట్ పాటించాలి. ప్రోటీన్, ఫైబర్ ఉండే ఆహారాలు తినాలి. కాయధాన్యాలు, నట్స్, విత్తనాలు, కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మొత్తంగా బరువు పెరిగి పొట్టరాకుండా 30 ఏళ్లు దాటిన పురుషులు దృష్టి సారించాలి.

**ఎముకలు, కండరాల దృఢత్వంపై..**

వయసు పెరిగే కొద్ది ఎముకల దృఢత్వం, కండలు తగ్గిపోతూ ఉంటాయి. ముఖ్యంగా 30 ఏళ్ల వయసు తర్వాత చాలా మంది బిజీగా ఉండి ఎక్సర్‌సైజ్‌లు మానేయడం, శారీరక శ్రమ తగ్గించేయటంతో ఇలా జరుగుతూ ఉంటుంది. మరికొందరు పోషకాలు సరిగా తీసుకోకపోవడం కూడా కారణంగా ఉంటుంది. 30 ఏళ్లు దాటిన తర్వాత కండలు బాగా ఉండాలంటే వెయిట్ లిఫ్టింగ్, రెసిస్టెంట్ వ్యాయామాలతో పాటు వివిధ రకాల ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ప్రతీ రోజు సాధారణ వ్యాయమాలు చేసినా.. వారంలో కనీసం మూడు రోజులైన ఈ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. వీటి వల్ల ఎముకల దృఢత్వం కూడా మెరుగ్గా ఉంటుంది. ప్రొటీన్లు, విటమిన్ డీ, కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి.





# ఎగ్ 65 .. ఇలా తయారుచేసుకోండి..!

సామాన్యులకు తక్కువ ధరకే లభించే పోషకాహారం గుడ్డు. దీనిలో ప్రొటీన్ శాతం ఎక్కువ. అయితే కోడిగుడ్డును ఉడికించుకొని.. ఆమ్లెట్ చేసుకొని, కర్రీ చేసుకొని మాత్రమే కాకుండా వివిధ రకాలుగా వంట చేసుకోవచ్చు. ఇందులో ఎగ్ 65 కూడా ఒకటి. దక్షిణ భారత ఆహార ప్రియులకు ఇష్టమైన ఫుడ్ లో ఎగ్ 65 కూడా ఒకటి. తమిళనాడులో మొదట ఈ ఎగ్ 65 తయారీ ప్రారంభమైనప్పటికీ క్రమంగా మిగతా ప్రాంతాల్లో కూడా స్ట్రీట్ ఫుడ్ లలో ఎక్కువగా వినియోగించే ఆహారంగా మారిపోయింది.మన తెలుగు ప్రజలు అయితే ఎగ్ 65 అంటే లొట్టలేసుకొని తింటారు. అయితే ఎంతో రుచికరమైన ఎగ్ 65ని మీ ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. దీన్ని తయారు చేయడం ఎలాగో ఇప్పుడు చూద్దాం.

## ఎగ్ 65 తయారీకి కావాల్సినవి

గుడ్లు మీ అవసరానికి తగినన్ని
మైదా పిండి 2 టేబుల్ స్పూన్లు
మొక్కజొన్న పిండి 4 టేబుల్ స్పూన్లు
కారం పొడి 4 టేబుల్ స్పూన్లు
గరం మసాలా 1/2 టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి 1 టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్ 1 టేబుల్ స్పూన్
నూనె కావలసినంత
ఉప్పు తగినంత

## ఎగ్ 65 తయారీ విధానం

ముందుగా గుడ్లను నీటిలో సరిగ్గా ఉడకబెట్టాలి. తర్వాత గుడ్డు పెంకును తొలగించండి. తర్వాత ఒక గిన్నెలో మైదా పిండి, మొక్కజొన్న పిండి, కారం పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేయాలి. తర్వాత అందులో నీరు కలపండి. క్రమంగా దాని పరిమాణాన్ని పెంచండి.. తద్వారా మీరు పేస్ట్ చేయడానికి బాగా కలపవచ్చు. ఇప్పుడు ఉడికించిన గుడ్డును చిన్న ముక్కలుగా తరిగి పిండిలో కలపండి. ఇప్పుడు పిండిని వేసి బాగా కదిలించండి.. తద్వారా మసాలాలు ప్రతి వైపు సమానంగా ఉంటాయి. ఇప్పుడు పేస్ట్ పూతతో గుడ్లు సిద్ధం చేసిన తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోయాలి. మీడియం మంట మీద మూడు నిమిషాలు వేయించాలి. గుడ్డు 65 బాగా వేగిన తర్వాత నూనెలోంచి తీసి ప్లేట్‌లోకి మార్చుకుని గ్రీన్ చట్నీతో తింటే ఆ రుచికి ఆహా అనాల్సిందే.



# మురుగన్ తమిళ దేవుడు

- **ఎన్టీఆర్-త్రివిక్రమ్ మూవీపై తమిళ తంబీల గుర్రు**

ఇడుపుకాయితం గొడవ సద్దుమణగక ముందే తాజాగా మరో తెలుగు సినిమా వివాదంలో చిక్కుకుంది. ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమాపై తమిళ తంబీలు ఫైర్ అవుతోన్నారు. పురాణాలను వక్రీకరించి సినిమా తీస్తే రిలీజ్ చేయనివ్వం అంటూ పోస్టులు, కామెంట్లు పెడుతున్నారు. నాగవంశీ ట్వీట్‌పై తమిళ తంబీలు ఫైర్ అవుతున్నారు. కుమారస్వామి ఉత్తరాదిన కాదు దక్షిణాదిన జన్మించాడని అంటున్నారు. మురుగన్ తమిళ దేవుడు అని కామెంట్లు పెడుతున్నారు. పురాణాలను వక్రీకరించి సినిమా తీస్తే ఊరుకునేది లేదని పోస్టులు పెడుతున్నారు. ఉత్తరాది దేవుడిగా కుమారస్వామిని చూపిస్తూ సినిమా తీస్తే రిలీజ్ చేయనివ్వం అంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు. దేవుడికి తెలుగు, తమిళం అనే భేదాలు ఉండవని మరికొందరు కామెంట్లు పెడుతుండడంతో ఈ వివాదం ఎంతవరకు వెళ్తుందో వేచి చూడాల్సిందే. కాగా ఈ మూవీని నందమూరి కళ్యాణ్ రామ్‌తో కలిసి రాధా కృష్ణ నిర్మించబోతున్నారు.





# ఓటీటీలోకి పతి పత్నీ ఔర్ వో దో

రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ రొమాంటిక్ మూవీ పతి పత్నీ ఔర్ వో దో ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. జూలై 10న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా కని పించిన ఈ సినిమాలో రకుల్, సారా అలీఖాన్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటించారు. ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్ తమ కెమిస్ట్రీతో ఆక ట్టుకున్నారు. కామెడీ, రొమాంటిక్ సీన్లు బాగున్నాయంటూ ఆడియెన్స్ నుంచి కామెంట్లు రాగా కాన్సెప్ట్ మాత్రం ఔట్‌డేటెడ్ అంటూ మరికొ న్ని విమర్శలు వచ్చాయి. కాగా ఈ మూవీకి ముదస్సార్ అజీజ్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం రామాయణలో శూర్పనఖ పాత్రలో కనిపించబో తోంది రకుల్.



# సౌత్‌పై హాట్‌బ్యూటీ ఫోకస్

ప్రభాస్ స్పిరిట్ మూవీతో బాలీవుడ్ హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టబోతుంది. సందీప్ వంగా దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో బోల్డ్ రోల్‌లో కనిపించనున్నట్లు చెబుతోన్నారు. ప్రస్తుతం స్పిరిట్ షూటింగ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీ కెరీర్‌కు సంబంధించి ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్నాళ్లు బాలీవుడ్ సినిమాలకు బ్రేక్ ఇవ్వాలని ఫిక్సైందట. దక్షిణాది సినిమాలపైనే ఫోకస్ పెట్టాలని అనుకుంటుందట. బాలీవుడ్‌లో వరుస డిజాస్టర్ల తోనే ఈ డెసిషన్ తీసుకుందని అంటున్నారు. ఇటీవల హిందీ దర్శక నిర్మాతలు చెప్పిన కొన్ని కథలను కూడా రిజెక్ట్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. కేజీఎఫ్ ఫేమ్ యశ్‌తో పాటు నాని, సుజీత్ మూవీలోనూ హీరోయిన్‌గా నటిస్తోన్నట్లు బయట టాక్ వినిపిస్తోంది.





# కోర్టు మెట్లెక్కిన తమిళ డైరెక్టర్.. ఎందుకంటే..

తమిళ డైరెక్టర్ సుధా కొంగర మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పరాశక్తి సినిమాకు సంబంధించి ఒప్పుకున్న రూ.17 కోట్ల రెమ్యూనరేషన్‌లో ఇంకా ఎనిమిది కోట్లు బాకీ ఉన్నారని తన పిటిషన్‌లో పేర్కొన్నది. ఇంతకీ విషయమేంటంటే.. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్, శ్రీలీల జంటగా నటించిన పరాశక్తి మూవీ ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ చేయడానికి రూ.17 కోట్ల రెమ్యూనరేషన్‌తో సుధా కొంగర అంగీకరించిందట. జీఎస్టీతో కలిపి రూ.17.70 కోట్లు చెల్లించడానికి అగ్రిమెంట్ చేసుకున్నారట. ఇప్పటివరకు 9.31 కోట్లు సుధాకు నిర్మాత చెల్లించగా సినిమా ఫ్లాప్‌తో మిగిలిన 8.39 కోట్లు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారట. దీంతో ఆమె కోర్టులో కేసు వేసిందట. తన రెమ్యూనరేషన్ సెటిల్ చేసే వరకు నిర్మాత ఆకాష్ భాస్కరణ్ తదుపరి సినిమా ఇదయం మురళి రిలీజ్ చేయడానికి వీలులేదంటూ పిటిషన్‌లో పేర్కొన్నది. కాగా ఇదయం మురళి మూవీ జూలై 10న రిలీజ్ కావాల్సి ఉండగా విడుదల అనుమానంగా మారింది.

# సాయిపల్లవి క్రేజ్..

- **షూటింగ్ స్టార్ట్ కాకముందే ఓటీటీ డీల్**

దక్షిణాదిలో హయ్యెస్ట్ సక్సెస్ రేటు ఉన్న హీరోయిన్‌గా కొనసాగుతోంది సాయిపల్లవి. ఇటీవలే మణిరత్నంతో ఓ రొమాంటిక్ లవ్‌స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది ఈ నాచురల్ బ్యూటీ. షూటింగ్ మొదలుకాకముందే ఈ సినిమా ఓటీటీ, థియేట్రికల్ హక్కులు రికార్డు ధరకు అమ్ముడుపోయాయట. సాయిపల్లవితో పాటు మణిరత్నానికి ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని డిజిటల్ రైట్స్‌ను రూ.20 కోట్లకు నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు సమాచారం. రిఆడియో రైట్స్ రూ.15 కోట్లు, ఓవర్‌సీస్ థియేట్రికల్ హక్కులు ఎనిమిది కోట్లకు అమ్ముడుపోయాయట. నిర్మాతలకు రూ. 43 కోట్ల వరకు గిట్టుబాటు అయ్యిందట. సాయిపల్లవి, మణిరత్నం, విజయ్ సేతుపతి కాంబోకు ఉన్న క్రేజ్‌కు నిదర్శనమిదని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.